

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి 7
8 ఘనంగా స్వామి వివేకానంద జయంతి

అందని 'రైతుబంధు'

- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- యాసంగిలో 1,34,725 మంది రైతులు అర్హులు
- జమ కావాల్సిన సాయం రూ 132.50 కోట్లు
- ఇప్పటివరకు రైతు ఖాతాల్లో రూ 19.61 కోట్లు మాత్రమే



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

యాసంగి సాగుకు రైతులు అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన రైతుబంధు పెట్టుబడి సాయం పంపిణీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును యథావిధిగా అందించే పక్రియ ప్రారంభించింది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి రైతుభరోసా పేరుతో రెట్టింపు సాయం అందించనుంది. కానీ యాసంగి సాగు నాట్లు జోరుగా సాగుతున్న రాజన్నసిరిసిల్ల జిల్లాలో రైతులకు రైతుబంధు జమ కాకపోవడంతో నానా తంటాలుపడుతున్నారు. రైతు బంధు పెట్టుబడి సాయాన్ని ప్రారంభించిన మూడు రోజులకే ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ప్రస్తుతం కేవలం రెండు, మూడు ఎకరాల వరకు మాత్రమే రైతు బంధు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. రైతుబంధు సాయం ఎప్పుడూ వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

● రైతుల నిరాశ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో రైతు బంధు అర్హులు 1,34,725 మంది ఉన్నారు. వీరికి రూ 132 కోట్ల 50 లక్షల 17 వేల 072 రైతు బంధుసాయం ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. ఇందులో 57 వేల 472 మంది రైతులకు రూ 19 కోట్ల 61 లక్షల 89 వేల 51 మాత్రమే జమ అయ్యాయి. రైతు బంధుకు సంబంధించి ట్రెజరీలో 1,14,020 మంది రైతులకు సంబంధించి రూ 85,33,34,377 పెండింగ్‌లో ఉంది. రైతు భరోసాతో ఆర్థికసాయం పెంపు చేస్తూ ప్రతియేటా రూ 15 వేలు, వరికి మద్దతు రూ 500 అందించడంపై హర్షం వ్యక్తం అవుతున్నా ప్రస్తుతం రైతు బంధు సాయం అందకపోవడంపై నిరాశ పడుతున్నారు.

జిల్లాలో రైతు బంధు సాయం వివరాలు

మండలం	రైతులు	మొత్తం (రూపాయల్లో)
గంభీరావుపేట	12,853	11,02,53,854
ఇల్లంతకుంట	17,934	19,66,72,874
ముస్తాబాద్	14,825	15,21,14,685
సిరిసిల్ల	4,872	3,33,83,755
తంగళ్లపల్లి	13,537	13,12,91,770
వీర్నపల్లి	4,554	3,88,68,036
ఎల్లారెడ్డిపేట	12,772	12,16,95,054
బోయినపల్లి	10,948	11,02,32,342
చందుర్తి	10,421	11,17,44,303
కోనరావుపేట	12,985	13,11,28,444
రుద్రంగి	3,811	4,31,16,682
వేములవాడ	7,102	6,27,76,659
వేములవాడ రూరల్	8,111	8,17,38,614
మొత్తం	1,34,725	132,50,17,072

● అప్పుల కోసం పరుగులు

యాసంగి సాగు జిల్లాలో 1.75 లక్షల ఎకరాలకు సిద్ధమయ్యారు. ఇందులో వరి 1.73 లక్షల ఎకరాల్లో వేయడానికి సిద్ధమయ్యారు., ఇప్పటి వరకు 86,830 ఎకరాల్లో నాట్లు వేశారు. మొక్కజొన్న 268 ఎకరాలు, పల్లి 30 ఎకరాలు, నువ్వులు 46 ఎకరాలు, పొద్దు తిరుగుడు 180 ఎకరాలు, శెనగలు 102 ఎకరాలు, ఇతర పంటలు 90 ఎకరాల్లో వేశారు. ఇందుకు సంబంధించిన పెట్టుబడి కోసం రైతులు అప్పులకోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు జిల్లాలో వ్యవసాయ కూలీల కొరతతో జిల్లాకు బిహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు నగదు చెల్లింపులే చేయాల్సి ఉండడంతో రైతులు అప్పులు చేయక తప్పడం లేదు. వలస కూలీలు ఎకరానికి 5,500 రూపాయల నుంచి 6,500 రూపాయల వరకు కూలీ తీసుకుంటున్నారు. రైతు బంధు అందకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో రైతు ఖాతాల్లో జమ అయిన వివరాలు

మండలం	రైతులు	మొత్తం (రూపాయల్లో)
గంభీరావుపేట	6,207	2,07,42,749
ఇల్లంతకుంట	6,784	2,21,61,060
ముస్తాబాద్	6,304	2,15,00,250
సిరిసిల్ల	2,304	66,46,317
తంగళ్లపల్లి	5,551	1,81,98,428
వీర్నపల్లి	2,692	1,28,70,424
ఎల్లారెడ్డిపేట	5,546	1,79,15,418
బోయినపల్లి	4,832	1,54,03,355
చందుర్తి	3,862	1,41,90,701
కోనరావుపేట	5,161	1,91,75,001
రుద్రంగి	1,552	68,71,972
వేములవాడ	3,375	1,00,23,867
వేములవాడ రూరల్	3,302	1,04,89,509
మొత్తం	57,472	19,61,89,051

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు తీసుకోండి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 12: సంక్రాంతికి ఊరెళ్తున్నారా... అయితే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెలవుల సందర్భంగా పట్టణాల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లేటపుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. వాహనాలను రహదారులపై నిలుపరాదన్నారు. ఊరెళ్లేటపుడు ఇంట్లో లైటు వేసి వెళ్లాలని, బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలన్నారు. ఇళ్లకు సెంట్రల్ లాకింగ్ విధానాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వాచ్‌మెన్‌ను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల న్నారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం అన్నారు. రోజు ఇంటికి వచ్చే పేపర్ బాయ్, పాల బాయ్‌ని రావద్దని చెప్పాలన్నారు. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకూడదన్నారు. పక్కింటి వారికి చెప్పి వెళ్లడమే కాకుండా పరిసరాలను గమనించాలని చెప్పాలన్నారు. ప్రయాణాల్లోనూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, దొంగలు విలువైన వస్తువులను చేతివాటం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి..

గంభీరావుపేట: సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు లేదా పండగ సెలవులకు ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని గంభీరావుపేట ఎస్ఐ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లే ముందు తప్పనిసరి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఊరెళ్లిన వారి ఇళ్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు. పండగ సందర్భంగా ఎవరైన చైన మాంజదారం అమ్మితే చట్ట రిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు: ప్రభుత్వ విప్

వేములవాడ రూరల్, జనవరి 11: దేశానికి గ్రామాలూ పట్టుకొమ్మలని ప్రభుత్వ విప్, వేములవా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వెంకటాంపల్లిలోని నూతన గ్రామపంచాయతీ భవనం, అంబేద్కర్ భవన్‌లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయాలు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటాయన్నారు. దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలన్నారు. గ్రామాలు పటిష్టంగా ఉన్నప్పుడే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధిపథంలో నడుస్తాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామన్నారు. ఆరు గ్యారెంటీలను వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రయ్య, ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీటీసీ నాయకులు వకులాభరణం శ్రీనివాస్, బండ శ్రీను, బొడ్డు రాములు, సామ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సీఐ , ఇద్దరు ఎస్ఐల అటాచ్డ్

సిరిసిల్ల క్రైం , జనవరి 12: జిల్లాలోని సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్‌ను ఐజీ కార్యాలయానికి, బోయినపల్లి ఎస్ఐ మహేందర్, రుద్రంగి ఎస్ఐ రాజేష్‌ను ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఐజీ, ఎస్పీ వేర్వేరుగా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని అత్యవసరంగా బదిలీ చేయడం జిల్లాలో చర్చనీయాంశం అయ్యింది. సిరిసిల్ల టౌన్ సీఐ గా బి రఘుపతిని నియమించారు.

ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం

సిరిసిల్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారాన్ని అందించేందుకు ప్రదీప్తి ఫౌండేషన్ ముందుకు వచ్చింది. త్వరలో జరగనున్న ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా రెగ్యులర్ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ప్రత్యేక స్టడీ అవర్‌ను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అల్పహారాన్ని అందించాలని కళాశాల ప్రిన్సిపల్ కనకశ్రీ విజయ రఘునందన్ నిర్ణయించారు. ఇందుకు దాతలుగా ప్రదీప్తి ఫౌండేషన్ ముందుకు వచ్చింది. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో అల్పాహార కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు గెంట్యాల భూమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు దీటి దేవయ్య, గెంట్యాల రాజశేఖర్, బుర్ర వెంకటేశం, చంద్రమౌళి, జంగిటి సురేస్, సామల వివేక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి చెరువు తూమును ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్, జనవరి 12: మండలంలోని నామాపూర్ గ్రామలోగల మల్లారెడ్డి చెరువు తూమును ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కావటి మహేందర్, తోట ధర్మేందర్ జంగ రాజు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని నామాపూర్ పరిధిలో గల మల్లారెడ్డి చెరువు తూమును ఒక వ్యక్తి ధ్వంసం చేసి తనకు సంబంధించిన బావిలోకి మళ్లించాడన్నారు. సొంత పొలం వైపు చట్ట విరుద్ధంగా తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బావిని మూసి వేయాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

చందుర్తి, జనవరి 12 : అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఎంతో నష్టపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గ్రామాలు అభివృద్ధిలో ముందుకెళ్లాయన్నారు. ముందుగా సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యలపై గళమెత్తారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతుండగా రేషన్ కార్డులు ఎప్పుడు పంపిణీ చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. రామన్నపేట, నర్సింగాపూర్ సర్పంచ్‌లు దుమ్మ అంజయ్య, రాపల్లి గంగాధర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లు కట్టుకునే వారు, ప్రభుత్వం భవనాల నిర్మాణాలకు ఇసుక కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేములవాడ, కోనరావుపేట మండలాల సరిహద్దుల వాగుల నుంచి ఇసుక తీసుకురావడం కోసం అనుమతి ఇవ్వాలని తహసీల్దారును కోరారు. జోగాపూర్ ఎంపీటీసీ మేకల గణేష్, మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబు మాట్లాడుతూ జోగాపూర్ నుంచి మరిగడ్డకు వచ్చే రోడ్డులో, మూడపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఉన్న లో లెవెల్ వంతెనతో వర్షాకాలంలో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని వెంటనే హైలెవెల్ వంతెన నిర్మాణం ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బి అధికారులను కోరారు. రోడ్లకు ఇరువైపులా వివిధ అభివృద్ధి పనుల కోసం కాంట్రాక్టర్ గుంతలు తియ్యగా వాటిని పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తడంతో ఆర్‌అండ్‌బి ఏఈ సతీష్ మాట్లాడుతూ సంబంధిత వాహనాలను సీజ్ చేసి వదిలిపెట్టామన్నారు. దీంతో జెడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ కొండ అరుణ మాట్లాడుతూ రోడ్డు ప్రక్కన తీసిన గుంతలను పూడ్చివేయకముందే ఎవరిని అడిగి వాహనాలను వదిలిపెట్టారని ఆర్‌అండ్‌బీ ఏఈని ప్రశ్నించారు. గ్రామ సంబంధిత సర్పంచులతో కలిసి సమన్వయంతో రోడ్డు మరమ్మత్తు పనులు జరిగే చూడాలని సూచించారు. మల్యాలలో లూజ్ వైర్లతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని లూజ్ వైర్లను సరిచేయాలనీ సర్పంచ్ లక్ష్మి నారాయణ సెస్ అధికారులను కోరారు. సమావేశంలో జడ్పీటీసీ నాగం కుమార్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, ఎంపీడీవో రవీందర్, ఎంఈఓ శ్రీనివాస దీక్షితులు, ఎంపీవో ప్రదీప్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా

- జీవో నం 51 రద్దు చేయాలని డిమాండ్

తంగళ్లపల్లి, జనవరి 12: ప్రభుత్వం జారీ చేసిన 51 జీవోను నిరసిస్తు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శివారులోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ముందు వ్యవసాయ కళాశాల విద్యార్థులు ధర్నా చేశారు. శుక్రవారం విద్యార్థులు కళాశాలలో నిరసన ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రధాన ద్వారం ముందు ధర్న నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లుడుతూ హైదరబాద్‌లోని యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తు జీవో నంబర్ 51 జారీ చేయాడాన్ని వ్యతిరేకిస్తున్నమన్నారు. హైకోర్టుకు కేటాయించిన యూనివర్సిటీ కి చెందిన 100 ఎకారాల స్థలంలో 439 రకాల వృక్ష జాతులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ పరిశోధనలు చేసే ఏకైక యూనివర్సిటీ అన్నారు. స్థలాన్ని కోర్టుకు కేటాయించి యూనివర్సిటీ పరిశోధనలను ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. జీవో 50ని రద్దు చేసేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రశ్నించేతత్వాన్ని ప్రతీ కవి అలవర్చుకోవాలి



నివాళులర్పిస్తున్న జూకంటి జగన్నాథం తదితరులు

సిరిసిల్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏది రాయాలో, ఏది రాయకూడదో తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి యువ కవులు, రచయితలు తెలుసుకోవాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అఖిలభారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. శుక్రవారం సిరిస్లిలలోని గాంధీ చౌక్ వద్ద తెలంగాణ రచయితల వేదిక, జిల్లా రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ నిత్యం తాను చూసిన సామాజిక రుగ్మతల్ని తన కవిత్వంలో ఇనుమడింపజేశారని అన్నారు. సిటీ లైఫ్ పేరుతో అలిశెట్టి ప్రభాకర్ ఆరేళ్లు ధారవాహికగా పత్రికల్లో మినీ కవితలు వచ్చాయని అన్నారు. రోజుకో వాగ్దానాల మృత శిశువును ప్రసవించే ప్రభుత్వానికి మంత్రులే మంత్రసానులంటూ తన కవిత్వంలో రాజకీయాన్ని ఎండగట్టారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కార్యదర్శి అడెపు లక్ష్మణ్, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టి వి నారాయణ, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు బూర దేవానందం, కామారపు శ్రీనివాస్, గణేష్, గుండెల్లి వంశీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్,జనవరి12: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్1,2,3,4, శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం బీసీ. స్టడీ సర్కిల్ నూతన భవనము, కరీంనగర్ కార్యాలయంలో ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా.. పదిమందికి గాయాలు

మంథనిరూరల్, జనవరి 12: మంథని-ఖమ్మంపల్లి ప్రధాన రహదారి గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపు తప్పి బోల్తాపడటంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తారం మండలం సీతంపల్లికి చెందిన నూనేటి రామయ్య తన ఆటోలో భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచ ప్రయాణీలకు తీసుకొని మంథని వైపు వస్తుండగా ఆటో ఆదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ రామయ్యతో పాటు ప్రయాణిస్తున్న 10 మందికి తీవ్ర గాయాలు కాగావారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఎడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, గోదావరిఖనికి తరలించారు.

ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. మేడిపల్లి సెంటర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద బుల్లెట్, మరో బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మంచిర్యాల జిల్లా మందమర్రి(జీలకుంట)కి చెందిన మొలిశెట్టి మహేందర్, ఎల్కలపల్లికి చెందిన అతుకుల సాయిరాం, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

వెల్గటూర్, జనవరి 12: జగిత్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల చికిత్స పొందుతూ శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గట్ల లచ్చయ్య (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లచ్చయ్య కొద్ది రోజుల క్రితం అయ్యప్ప మాల వేసుకున్నాడు. ఈ నెల 7న వెల్గటూర్‌లో గౌరి వెంకట చైతన్య ఏర్పాటు చేసిన అల్పాహారానికి వెళ్లిన లచ్చయ్య మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలో కల్వర్టుపైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన కండ్లె కృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ దత్తాత్రి కథనం ప్రకారం బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ తన భార్య గంగజలతో కలిసి జీవనోపాధి నిమిత్తం తుమ్మెనాల తల్లి ఇంటికి వచ్చారు. అక్కడే సమీపంలో గల గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. కృష్ణ మూర్ఛతో బాధ పడుతున్నాడు. ఈ నెల 1న నేరెళ్ల సమీపంలో గల కల్వర్టుపైన కూర్చొని ఉండగా హఠాత్తుగా కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తున్న బీజేపీ

- రాజకీయం కోసమే అయోధ్య రామమందిర నిర్మాణం
- మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ

హుజూరాబాద్, జనవరి 12: సామాజిక రాజకీయ ఆర్థిక ప్రయోజనాల కోసం బీజేపీ భారత ప్రజలను మతాలుగా విడగొట్టి ఘర్షణలు సృష్టిస్తోందని తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట శుక్రవారం ఒక ప్రకటన వెలువడింది. రాజకీయ దురుద్దేశ్యంతోనే ఆర్ఎస్ఎస్, బీజేపీ అయోధ్య రామమందిర నిర్మాణం చేపట్టిందన్నారు. 500ఏళ్ల కిందట ముస్లింలు పవిత్రంగా విశ్వసించే బాబ్రీ మసీద్‌ను నిర్మించుకొని వాళ్ల విశ్వాసాల ప్రకారం ప్రార్థనలు చేస్తూ వస్తున్నారన్నారు. కానీ రాముడు జన్మించిన స్థలం అంటూ కట్టు కథలు సృష్టించి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిస్టు సంస్థలు 1992, డిసెంబరు 6న బాబ్రీ మసీద్‌ను బలవంతంగా కూల్చి వేశారన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలో సుప్రీంకోర్టులో చారిత్రాత్మక వాస్తవాలను కప్పి పుచ్చి తీర్పు ఇప్పించారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో 2024 సాధారణ ఎన్నికల్లో మూడో విడత అధికారాన్ని చేపట్టడానికి రామమందిరాన్ని వాడుకుంటున్నారన్నారు. 2047నాటికి పరిపూర్ణ హిందుత్వ రాజ్యంగా మార్చాలనే ప్రధాన లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తుందన్నారు. మతతత్వ రామమందిర ఆవిష్కరణను ప్రజలు వ్యతిరేకించాలని లేఖలో పేర్కొన్నారు.

17క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- రైస్‌మిల్లులో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు
- యజమానిపై ఆగ్రహం

ఇల్లందకుంట, జనవరి 12: అక్రమంగా తరలిస్తున్న 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డి అనే వ్యక్తి ఉదయం ఎడ్లబండిపై కొత్తపల్లి నుంచి ఇల్లందకుంట వైపు తీసుకువస్తుండగా గమనించిన పోలీసులు దాన్ని వెంబడించారు. ఆ ఎడ్లబండి ఇల్లందకుంటలోని సీతారామాంజనేయ రైస్‌మిల్‌లోకి చేరింది. ఎస్సై రాజకుమార్ వెంటనే సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ (ఓఎస్‌డీ) అధికారుల బృందం మిల్లుకు వచ్చి తనిఖీలు నిర్వహించారు. మిల్లు యజమాని అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లులో స్టాక్ రిజిస్టర్, స్టాంపులు కూడా సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సదరు మిల్లు యజమాని 2021-22 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 10 లారీల వడ్లు పట్టించి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు పంపించకపోవడంపై మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన వడ్లు లేకపోవడంపై మండిపడ్డారు. 2022-23 సంబంధించిన బియ్యం కూడా ప్రభుత్వానికి అప్పగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపించిన బియ్యం కూడా క్వాలిటీగా లేవని, నెల రోజుల్లోగా ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం పంపించాలని చెప్పారు. లేని యెడల మిల్‌ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. గతంలో పంపించిన 290 క్వింటాళ్ల బియ్యాన్ని కూడా వాపస్ పంపిస్తే అవి కూడా మిల్లులో లేకపోవడంపై మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న బియ్యాన్ని నమూనాలు సేకరించి ల్యాబ్ పంపిస్తామని చెప్పారు. అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు రిపోర్టు రాస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి ఓఎస్‌డీ ప్రభాకర్, సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్ మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు, డీఎం రజనీకాంత్, డీసీఎస్‌వో సురేష్‌రెడ్డి, డీటీసీ, ఎస్ఐ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.


రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవం


వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 12 : పట్టణంలో అతిపురాతనమైన శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడారై ఉత్సవం (ఇత్తడి గంగాళంలో ప్రసాదం) ఘనంగా జరిగింది. అదేవిధంగా తిరుప్పావై ఉత్సవం అర్చనలు, అభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బీర్నంది నరసింహాచారి, ఈఓ విక్రమ్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, అండాల్ గోష్టి బృందం పాల్గొన్నారు.

జమ్మికుంట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష తులసి కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

'ఖని'లో ట్రక్కు బీభత్సం

- బస్టాండ్ వద్ద ట్రాలీని ఢీకొట్టి హోటల్‌లోకి..
- ట్రాలీ, ద్విచక్ర వాహనం ధ్వంసం
- ఒకరికి స్వల్ప గాయాలు



ట్రాలీని ఢీకొట్టిన ట్రక్కు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖనిలో శుక్రవారం తెల్లవారు జామున ట్రక్కు బీభత్సం సృష్టించింది. హైదరాబాద్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో కాగజ్‌నగర్‌కు వెళుతున్న ట్రక్కు (టీఎస్07యూపీ0198) గోదావరిఖని బస్టాండ్ వద్ద అదుపు తప్పి మున్సిపల్ చెత్త ట్రాలీని ఢీకొట్టింది. అక్కడే టీ స్టాళ్ల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. శబ్దంతో లోపలికి పరుగులు తీశారు. ఆటో ట్రాలీని తోసుకుంటూ వేగంగా ట్రక్కు బస్టాండ్ ముందున్న టీ స్టాల్‌లోకి దూసుకుపోయింది. మున్సిపల్ ఆటో డ్రైవర్ ట్రాలీలోనే ఉన్నాడు. ఆటో ట్రాలీ, మరో మోపెడ్, సైకిల్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్రాలీ డ్రైవర్ మున్సిపల్ కార్మికుడు రమేష్ ట్రాలీలోనే చిక్కుకోవడంతో స్థానికులు అతన్ని బయటకు తీశారు. స్వల్ప గాయలతో అతను బయట పడ్డాడు. ఈ ఘటనతో భయకంపితులై ప్రయాణీకులు పరుగు పెట్టారు. డ్రైవర్‌ను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ స్వామి, ఏఎస్ఐ మల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ శ్రీనివాస్, పీచర శ్రీనివాస్ పరిశీలించారు.

ఎన్టీపీసీలో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, జనవరి 12: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. పీటీఎస్‌లోని రింక్ కోర్టులో జరిగిన పోటీలను కరీంనగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దయానంద్ గాంధి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి బానేశ్వర్ రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పలువురు చిన్నారులు రోలర్ స్కేటింగ్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పిల్లలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఎన్టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే చీరలకు వేలం

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు సమర్పించే చీరల వేలం పాటను ఆలయ సమావేశ మందిరంలో ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. టెండర్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో మూడు టెండర్లు రాగా, ముగ్గురు కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరయ్యారు. గత వేలం పాటలో ఈ కాంట్రాక్ట్‌ను రూ. 78 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు. నూతనంగా 2024-26కు గాను టెండర్ నిర్వహించగా స్వామివారి పాటగా రూ. 83 లక్షలతో అధికారులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ రూ 95 లక్షల వరకు వేలంపాట పాడి అక్కడికి నిలిచిపోయారు. తరువాత ఆన్‌లైన్ టెండర్లను తెరిచిన అధికారులు సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ రూ. కోటి 1 లక్ష 116లకు కోట్ చేయడంతో టెండర్ సిద్ధార్థ అనే కాంట్రాక్టర్ కు ప్రకటించారు. కరోనా సమయంలో టెండర్‌కు ఇప్పటికి రూ. 18 లక్షల తేడా ఉండటంతో కాంట్రాక్టర్లు పెద్దఎత్తున సిండికేట్ అయినట్లు ఆరోపణలు బాహాటంగానే వినబడుతున్నాయి. అమ్మవారి చీరల వేలం పాట సుమారు ఒక కోటి 30 లక్షల వరకు పలుకుతుందని భావించగా, కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి వేలం పాటను ఒక కోటి ఒక లక్ష రూపాయలకే పరిమితం చేశారని చర్చసాగుతుంది. అధికారుల కనుసైగల్లోనే కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారినట్లు ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ. 2 లక్షల వరకు చేతులు మారాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఈవో కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా అనుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యామని, శాఖపరమైన విచారణ చేస్తామని అన్నారు. తిరిగి టెండర్ నిర్వహిస్తే కోటి దాటి మరింత ఆధాయం సమకూరే అవకాశం ఉందని ఆలయ వర్గాల్లో గట్టి వాదనలు వినిపిస్తున్నాయి.


వేలపాటకు హాజరయిన అధికారులు, కాంట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక జనవరి 12: మండలంలోని ఎలబాక గ్రామ శివారులో మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. వేగురుపల్లి సమీపంలోని మానేరు నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ యాజమాని కొమిరె ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 12: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 11 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి మూడు రోజులు జైలుశిక్ష, 2,500 రూపాయల జరిమానా, మరో 10 మంది వాహనదారులకు 18,500 రూపాయల జరిమానా విధించినట్లు ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బోయినపల్లి, జనవరి 12: మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన గుండ్ల కనకయ్య (47) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల కనకయ్య కుటుంబం ఉపాధి కోసం కరీంనగర్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. కనకయ్య నీలోజిపల్లిలో గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి కొంత మేరకు అప్పు కావడంతో ఉపాధి కోసం కొద్ది నెలలుగా భార్యతో కలిసి కరీంనగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో కనకయ్య మద్యానికి బానిస అయ్యాడు. అప్పు తీర్చే మార్గం లేక మనోవేదన చెందుతుండేవాడు. గురువారం కరీంనగర్ నుంచి నీలోజిపల్లికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 12: మండలంలోని రంగరావుపేట గ్రామానికి చెందిన గంగుల సామిల్(32) అను వ్యక్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానిక చెందిన గంగుల సామిల్ కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగలేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడు సామిల్ తండ్రి గంగుల నరేష్ ఫిర్యాదు మేరకు కేసు ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 12: కరీంనగర్ బస్టాండ్ రోడ్‌లోని తెలంగాణ మెడికల్ షాపు పక్కన శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 45-50 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతుడు ధరించిన టీషర్ట్‌పై ఇండిగో పెయింట్స్ అని రాసిఉందని, గుర్తుపట్టిన వారు వన్‌టౌన్ సీఐ 8712670761, 9908440822లకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీ గదిలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత..ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి12: కొత్తపల్లి మండల కేంద్రం, రేకుర్తిలలో కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకున్నారు. కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్‌రెడ్డి, ఈఎస్ శ్రీనివాసరావు, ఏఇఎస్ తాతాజీల ఆదేశాల మేరకు ఉదయం 10గంటల రేకుర్తి, కొత్తపల్లి గ్రామాలలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా గొల్లపల్లి మండలం నంచెర్లకు చెందిన రంగు వినయ్, కిసాన్‌నగర్‌కు చెందిన యాదగిరిలు గంజాయితో పట్టుబడ్డారు. కొత్తపల్లికి చెందిన ఉపేందర్ పరారీ అయ్యాడు. ఇద్దరు నిందితుల వద్ద 1,726 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. గంజాయికి అలవాటు పడిన ఆరుగురు వియోగదారులను కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో బైండోవర్ కోసం అప్పగించారు. ఈ దాడులలో ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమలుద్దీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూ క్రాస్‌కు చేరిన పందెం కోడి


పందెం కోడిని అప్పగిస్తున్న అధికారులు

భగత్‌నగర్, జనవరి 12: ఆర్టీసీ బస్సులో దొరికిన పందెం కోడి బ్లూక్రాస్ చేరింది. ఆర్టీసీ అధికారులు ముందుగా శుక్రవారం బహిరంగవేలం నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ కమిటీ నిర్ణయం మేరకు వేలం రద్దు చేశారు. అనంతరం ఆ పందెం కోడిని బ్లూక్రాస్ సొసైటీ జంతు సంరక్షణ ఇన్‌చార్జి తూం నారాయణకు కోడిని అందజేశారు.

కొడుకు మోసగించాడని సీపీని ఆశ్రయించిన రిటైర్డ్ కార్మికుడు

- కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కోల్‌సిటీ, జనవరి 12: గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న అర్నకొండ సదానందం అనే కానిస్టేబుల్‌పై శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అయిన తండ్రికి మాయమాటలు చెప్పి మోసగించి ఆస్తులు తన పేర గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడనే ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. బస్టాండ్ కాలనీలో నివాసముండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అర్నకొండ అంజయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు మరణించగా రెండవ కుమారుడు సింగరేణిలో పని చేస్తున్నాడు. మూడవ కుమారుడు సదానందం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బస్టాండ్ క్వార్టర్ల సమీపంలో అంజయ్య పేర ఉన్న ఇల్లు, స్వగ్రామం సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూరులోని రెండు ఎకరాల వ్యవసాయ భూమి చిన్న కుమారుడు సదానందం గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, తనను నమ్మించి మోసగించి గిఫ్ట్ డీడ్ చేయించుకున్నాడని, అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్లు బాధితుడు పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు సదానందంపై ఐపీసీ 420, 384, 506, 24ఆఫ్ మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం ఎస్ఐ సమ్మయ్య కేసు నమోదు చేశారు.

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చేరాలు

జమ్మికుంట, జనవరి 12: సాంకేతిక నైపుణ్యాన్ని వ్యవసాయంలో ఉపయోగించి నూతన ఆవిష్కరణలు తీసుకు వచ్చి రైతులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మాజీ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి చేరాలు అన్నారు. పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శుక్రవారం మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జాతీయ యువత దినోత్సవం, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను రైతులకు సులభ రీతిలో అర్థం చేయించాలన్నారు. తద్వార అధిక దిగుబడులు, రాబడులు సాధించి ఆర్థిక, సామాజిక, శాస్త్రీయ పరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇప్పుడున్న ఉన్న యువత సాంకేతికంగా చాల చురుకుగా ఉన్నారని చెప్పారు. వారి నైపుణ్యం రైతుల పురోభివృద్ధికి తోడు కావాలని కోరారు. యవత దేశ పరంగా బాధ్యత యుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్, శాస్త్రవేత్తలు డాక్టర్ మహేష్, డి శ్రీనివాస్, జె విజయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కవిరాజ్, వంశీ పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం


స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

మెట్‌పల్లి, జనవరి, 12: పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులోని కోదండరామాల యంలో స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణాన్ని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంప తులు, కమిటీ నిర్వాహకులు మహాజన్ నరసింహులు దంపతులు వైభంగా జరిపిం చారు. తిరుప్పావై ధరూర్ మాస మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయం లోని స్వామి వారికి పురోహితులు రమాకాంత్ బృందం ప్రత్యేక అభిషేకాలు, పూ జలు, హారతి వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఈఈ వెంకటేశ్వర్లు, ఈఈ అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్మూర్ పోచయ్య, సుతారి బుచ్చిరాజు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం పురోహితులు ఘనంగా జరిపారు. శుక్రవారం ఆలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపి హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య గోదాదేవి రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల్లోని భక్త లు పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి

- కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ గుప్తా


మల్కాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అజయ్ గుప్తా, కలెక్టర్ అనురాగ్ జయంతి

కోనరావుపేట, జనవరి 12: అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ సంకల్ప యాత్ర కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్పయాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్ గుప్తా అన్నారు. కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో శుక్రవారం వికసిత్ సంకల్ప్ యాత్రను ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ ద్వారా వ్యవసాయం ఎలా చేయాలనే అంశంపై ప్రత్యక్షంగా డ్రోన్ ద్వారా వరి పొలాలపై పిచికారి చేస్తుండగా ఆయన కలెక్టర్‌తో కలిసి తిలకించారు. అనంతరం అజయ్ గుప్తా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎలాంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎంత మంది ప్రయోజనాలు పొందారు, ఎంతమందికి అందాయి అని తెలుసుకోవడం కోసమే ఈ యాత్రను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎలా అందుతున్నాయోనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో రవీందర్, రామకృష్ణ సర్పంచ్ ఆరే లత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 12: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కాగా రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కులు చెల్లించకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు సాయంత్రం తిరుగు పయాణమయ్యారు. కాగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని కేంద్ర టెక్స్‌టైల్ వంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వీచ్చేసిన ఆయనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక దర్శనం అనంతరం మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వ దించగా ఆలయ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్ స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మద్యం మత్తులో ఎస్సైపై బీజేపీ నేత దురుసు ప్రవర్తన

జ్యోతినగర్, జనవరి 12: మద్యం మత్తులో సప్ప నాగరాజు అనే బీజేపీ నాయకుడు ట్రాఫిక్ ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించడంతోపాటు దూషించిన సంఘటన గురువారం సాయంత్రం మేడిపల్లి సెంటర్‌లో జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ టి.ఉదయ్ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సప్ప నాగరాజు, మేకల నారాయణలపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మేడిపల్లి సెంటరులో రామగుండం ట్రాఫిక్ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తన సిబ్బంతో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న నాగరాజు, నారాయణలను ట్రాఫిక్ పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌లో ఊదాలని బైక్ నడుపుతున్న నాగరాజుకు పోలీసులు చెప్పినప్పటికీ నిరాకరించాడు. ఈ క్రమంలో ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌తో పాటు డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ సిబ్బందిపై నాగరాజు, నారాయణలు దురుసుగా వ్యవహరిస్తూ దూషించారు. ఈక్రమంలో సంఘటన స్థలానికి వచ్చిన ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ బీజేపీ నాయకుడు నాగరాజు, నారాయణలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనపై దురుసుగా ప్రవర్తించడం, దూషించడంతో పాటు తన విధి నిర్వహణను ఆటంకపరిచాడని ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఎన్టీపీసీ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నాగరాజు, నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీవన్ తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు అప్‌లోడ్ చేసిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, జనవరి 12: చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్ అకౌంట్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ చైల్డ్‌పోర్న్ వీడియోస్ డౌన్‌లోడ్ చేసి ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశాడు. హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసు వారి సమాచారం మేరకు రజాక్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ అప్‌లోడ్ చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లెల్లలో చైన్ స్నాచింగ్

తంగళ్లపల్లి, జనవరి 12: మండలంలోని జిల్లెల్లలో చైన్ స్నాచింగ్ జరిగింది. జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రారపు పోచవ్వ అసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని జంట ద్విచక్ర వాహనంపై పోచవ్వకు లిఫ్ట్ ఇచ్చారు. పోచవ్వ ఇల్లు గ్రామ శివారులో ఉండగా మధ్యలో రేషన్‌షాప్ వద్దకు రాగానే బియ్యం తీసుకువెళ్లాలి ఇక్కడే దింపేయమని కోరింది. వాహనం దింపివేసి ఒక్కసారిగా పోశవ్వ మెడలోని గొలుసును లాగేసుకొని మల్లాపూర్ వైపు పారిపోయినట్లు బాధితురాలు పోచవ్వ తెలిపింది. సుమారు మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకు వెళ్లినట్లు తెలిపింది. మల్లాపూర్ రేణుకా ఆలయం వద్ద సీసీ కెమెరాలో ద్విచక్ర వాహనంపై ఉన్న జంట కదలికలు రికార్డు అయినట్లు స్థానికులు చెప్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోచవ్వ తెలిపింది.

కవులు సామాజిక నిర్మాతలు


పురస్కారం అందుకున్న తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 12: ప్రజాపక్షం వహించే కవులు నవసమాజ నిర్మాతలని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024కుగాను అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారాన్ని కవయిత్రి తోట నిర్మలారాణికి ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, అలిశెట్టి ప్రభాకర్ సతీమణి భాగ్యలక్ష్మి చేతులమీదుగా ప్రదానం చేశారు. తెవరే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, కవులు అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం, అలిశెట్టి సంగ్రామ్, దామరకుంట శంకరయ్య, పీఎస్ రవీంద్ర, వెగ్గలం ఉషశ్రీ, కందుకూరి అంజయ్య, రామానుజం సుజాత, శ్రీనివాస్, పత్తెం వసంత, సరసిజ, నడిమెట్ల రామయ్య పాల్గొన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం

కరీంనగర్ క్రైం, జనవరి 12: హాంగ్‌కాంగ్ పంపిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కరీంనగర్‌లోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ సంస్థకు చెందిన మినహాజ్ అలీ, రఫిక్‌అలంపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గాజుల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ఆంజనేయులు, మరో వ్యక్తితో కలిసి 2023న అక్టోబరులో కార్ఖనగడ్డలోని ఇండో అరబ్ కన్సల్టెన్సీ మినహాజ్ అలీ వద్దకు వెళ్లారు. హాంగ్‌కాంగ్‌కు వెళ్లేందుకు ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఈ మేరకు ఆంజనేయులు రూ.1.10 లక్షలు, రాయుడు రూ. 1.20 లక్షలు ఇచ్చారు. మరో ఇద్దరిని కూడా హాంగ్‌కాంగ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు.

క్రీడాకారులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



క్రికెట్ పోటీలను ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, జనవరి 12: రాష్ట్రంలో క్రికెట్ అసోసియేషన్ కొత్త కమిటీ ఏర్పడి నందున నైపుణ్యం ఉన్న క్రికెట్ క్రీడాకారులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం మదీన యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కేటీఆర్ కప్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ అకాడమీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు జాతీయస్థాయిలో ఆడుతున్నారని అన్నారు. మున్సిపల్ పాలకవర్గం క్రీడా మైదానం అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి

వేములవాడ టౌన్, జనవరి 12 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో అత్యున్నత స్థాయిలో స్థిరపడడానికి నిరంతరం కృషి చేయాలని హైదారాబాద్ జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలంలోని అగ్రహారం జేఎన్టీయూ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు, జాతీయ యువజన దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జీఎస్ శ్రీనివాస్, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, సురేష్‌బాబు, ధీరజ్, బాలరాజు, ప్రసన్న, భాస్కర్, రంజిత్, శ్రావణ్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి, జనవరి 12: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. శుక్రవారం పాఠశాల అవరణలో 1997-98వ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అలాగే చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

పౌరసరఫరాల కమిషనర్‌ను కలిసిన అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 12: రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మార్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలను చేపట్టిన చౌహాన్‌ను అదనపు కలెక్టర్ కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపి అనంతరం అయనతో భేటీ అయ్యి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు, భారత అహార సంస్థకు సీఎంఆర్ త్వరగా డెలివరీకి తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు.

మహిళలల్లో కళానైపుణ్యానికి నిదర్శనం ముగ్గులు

సిరిసిల్ల రూరల్, జనవరి 12: మహిళలల్లో కళానైపుణ్యాన్ని నింపేందుకు నిదర్శనమే ముగ్గులని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ అన్నారు. అఖిల భారత మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో ఐద్వా జిల్లా సంఘం అధ్వర్యంలో సంక్రాతి ముగ్గుల పోటీలను నిర్వహించగా మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. గెలుపొందిన మహిళలకు బహుమతులను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వివిధ రకాల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకలు మూషం రమేష్, కోడం రమణ, మిట్టపల్లి రాజమౌళి, వడ్ల లక్ష్మీ, పూజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి

- జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

చందుర్తి, జనవరి 12: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. చందుర్తి మండల పరిషత్, సెస్ కార్యాలయాల్లో వేరువేరుగా సర్పంచుల పదవీకాలం ముగిస్తున్నందున సర్పంచులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు గ్రామాలను అభివృద్ధి చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. మంచి చేసినప్పుడు పేరు స్థిరస్థాయిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బైరగోని లావణ్య, జడ్పీటీసీ నాగం కుమార్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మెర్గు అంజాగౌడ్

ముస్తాబాద్, జనవరి 12: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా మెర్గు అంజాగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ నియామకపత్రాన్ని అందించారు. అంజాగౌడ్ బీజేపీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా దాదాపు ముప్పైయేళ్లుగా పనిచేస్తున్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానని అంజాగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కరెడ్ల మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, కుడుకల జనార్ధన్‌యాదవ్, ప్రభాకర్, ఏదూనూరి గోపి తదితరులు అంజాగౌడ్‌ను అభినందించారు.

పశువుల తొట్టి నిర్మించాలి

గంభీరావుపేట, జనవరి 12: మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో శుక్రవారం మాల మహానాడు ఆద్వర్యంలో ఆందోళన చేపట్టారు. దోసలగూడెంలో ఉన్న పశువుల తొట్టి కూలిపోయిందని, దీనిపై ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కూలిపోయిన చోటే పశువుల తొట్టిని తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, మండల అధ్యక్షుడు లక్కం బాబు, నాయకులు అనిల్, కమార్ ఉన్నారు.

ఘనంగా గోదారంగనాయకుల కల్యాణం

వేములవాడ రూరల్, జనవరి 11: మండలంలోని ఎదురుగట్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోదారంగనాయకుల స్వామి వార్ల కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో అందంగా అలంకరించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమలో సర్పంచ్ సోయినేని కరుణాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎనుగు మనోహర్ రెడ్డి, ఎంపీపీ బండ మల్లేశం, జడ్పీటీసీ ఏశ వాణితిరుపతి, ఎంపీటీసీ వెలుమ నర్సవ్వ బాల్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ సంపేట గంగరాజు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పురోహితులు నవీన్ చారి, వేణుగోపాల చారి ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, కంకణధారణ, సూత్రధారణ, తలంబ్రాలతో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జితేం దర్, వైస్ చైర్మన్ వెంకటేష్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



తంగళ్లపల్లిలో వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



చందుర్తి మండలం మల్యాలలో..



సిరిసిల్లలో బీజేపీ ఆధ్వర్యంలో..

సిరిసిల్ల టౌన్, జనవరి 12: జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌక్ వద్ద సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కోడం రవి మాట్లాడుతూ భారత దేశ ఆధ్యాత్మిక సాంస్కృతికి కీర్తి పథకాన్ని ప్రపంచ యవనికపై ఎగరవేసి స్వామి వివేకనంద యుగపురుషుడైన్నాడని అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక నాయకులు సుంకోజు రమేష్‌చారి, తుంగ పవన్‌కుమార్, ఏర్రోజు శ్రీనివాస్, చిలుక వేణు, ఆడెపు రవీందర్, గాజుల వేణు, బొజ్జ శ్రీను, మోర శ్రీహరి, సుంచు ప్రకాష్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: నేటి యువతరానికి వివేకానంద స్ఫూర్తి ప్రధాత అని వారి ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలని భారతీయ జనతాపార్టీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనగంటి నరేష్, చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, ఠాకూర్‌రాజుసింగ్, సత్యసాయి, మొగిలిరాజు, గుడ్ల విష్ణు, కోడం ఆనంద్‌బాబు, తడుక విజయ్, పోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో వివేకానంద జయంతోత్సవాల్లో బాగంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు దెవసాని కృష్ణ, స్వామి రాజు, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లితో పాటు వివిధ గ్రామాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, సర్పంచ్ సరోజన, ఉపసర్పంచ్ దేవయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ రమేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ క్లబ్‌లో ఎంపీపీ పడిగెల మానస రాజు, స్థానిక సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ తదితరులు స్వామి వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వివేకనంద కాలనీలో కాలనీ వాసులు స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు.

● స్వామి వివేకానంద జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డైనమిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దుబ్బాక రమేష్ అధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస రాజు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, ప్యాక్స్ చైర్మన్ కొడూరి భాస్కర్‌గౌడ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మల్యాలలో వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా స్వామి వివేకానంద విగ్రహానికి, చందుర్తిలో వివేకానంద చిత్ర పటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీఐ కిరణ్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవిందర్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ అబ్రహం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు పోంచేట్టి రాకేష్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో స్వామి వివేకానందుని జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వివేకానందుని విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనబోయిన బాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, మామిడి పర్శరాం, మామడి రాజు, అంతగిరి వినయ్‌కుమార్, ఏగుర్ల శ్రీనివాస్, చిట్టి ప్రదీప్‌రెడ్డి, మామిడి తిరుపతి, అవారు బాలయ్య, అంతగిరి భాస్కర్, పసుల వెంకటి, కాథ మల్లేశం, కరివెద కర్ణాకర్‌రెడ్డి, రాంకిషన్, రాము తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో..



గంభీరావుపేటలో..

విద్యా విధానాల్లో మార్పులు తీసుకువస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తుందని, గత ప్రభుత్వం జారీ చేసిన 370 జీవో వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందుల పడ్డారని దీనిపై ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులతో చర్చలు జరగవచ్చునని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం రగుడు బైపాస్ పక్కన ఉన్న మైదానంలో ఎలారెడ్డిపేట మాజీ మండల విద్యాధికారి మంకు రాజయ్య స్మారక క్రికెట్ టీపీఎల్-3 జిల్లా స్థాయి మెగా టోర్నమెంట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అలసిపోయిన ఉపాధ్యాయులకు ఈ వేదిక ఒక ఆటవిడుపు అని, క్రీడల ద్వారా ఉపాధ్యాయులకు శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మండల విద్యాధికారి మంకు రాజయ్యను స్మరించుకుంటూ క్రికెట్ టోర్నమెంట్‌ను అన్ని ఉపాధ్యాయ సంఘాలు కలిసి నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. పేదలకు విద్యను అందించడంలో మంకు రాజయ్య సఫలీకృతుడయ్యారన్నారు. విద్యా విధానంలో మార్పును తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ఉపాధ్యాయులంటే సమాజంలో ఒక గౌరవం ఉందని విద్యను ఉన్నత స్థితికి తీసుకురావడానికి ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. విద్యా విధానంపై చర్చ జరపాడానికి ఒక సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను టీపీఎల్ ఆర్గనైజర్ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం టీటీయూ-24 క్యాలెండర్‌ను ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ, టీపీఎల్ - 3 ఆర్గనైజర్ కమిటి సభ్యులు, జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● క్రీడలతో మానసికోల్లాసం..

వేములవాడ టౌన్: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద, అలిశెట్టి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలూ విద్యార్థులకు అవసరమని అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చెన్నమనేని శ్రీకుమార్, సంఘస్వామి యాదవ్, లింగంపల్లి కిరణ్, సంద్రగిరి శ్రీనివాస్, బింగి మహేష్, పుల్కం రాజు, కొమురయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

ముస్తాబాద్: మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన బిట్ల వెంకటేశ్ కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లగా ఇంటి తాళాన్ని పగుల గొట్టి ఇంట్లో ఉన్న ఎనిమిది తులాల బంగారం, 20 తులాల వెండి, అరవై వేల నగదును దొంగలు అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్, ఇందిరమ్మకాలనీ గ్రామాల్లో ఆయోధ్య శ్రీ సీతరాముల పూజిత అక్షింతలను ఊరేగించారు. అనంతరం ఇంటి ఇంటికి అక్షింతలను ఆందజేశారు.

వేములవాడ రూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామంలో అయోధ్య రాములవారి అక్షింతలను శుక్రవారం ఊరేగింపుగా తీసుకువెళ్లి ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ జక్కుల కవిత తిరుపతి, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: విద్యుత్‌ను పొదుపు చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని దీనికి కోసం ప్రజలందరూ స్టార్ లేబుల్ విద్యుత్ ఉపకరణాలను వినియోగించుకోవాలని సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య కోరారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలోని సమావేశమందిరంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరింపనీయ ఇంధన వనరుల సంస్థ, నేషనల్ ప్రొడక్టివిటి కౌన్సిల్ బ్యూరో అఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ సంయుక్తంగా విద్యుత్ పొదుపుపై అవగహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐ విద్యార్థులతోపాటు ఎలక్ట్రికల్ అసోషియేషన్ ప్రతినిధులకు విద్యుత్ పోదుపుపై నేషనల్ ప్రొడక్టివిటి కౌన్సిల్ బ్యూరో అఫ్ ఎనర్జీ ఎఫీషియన్ బీఈఈ రజనీకాంత్, రెడ్కో మేనేజర్ లక్ష్మీకాంత్ అవగహన కల్పించారు.

- కేంద్ర ప్రభత్వం తీసువచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో అందరికి విద్య, అందరికి ఉపాధిని కల్పించాలని కోరుతూ ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఢిల్లీలో నిర్వహించారు.

బోయినపల్లి: విధుల నిర్వహణలో ఇద్దరు కార్యదర్శులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన బోయినపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ప్రజాపాలన దరఖాస్తులను విషయంలో మర్లపేట కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విలాసాగర్ కార్యదర్శికి ఉన్నతాధికారులు బాధ్యతలను అప్పగించారు. దీంతో ఇద్దరు కార్యదర్శుల మధ్య మాటామాటా పెరిగి ఒకరినొకరు దాడి చేసుకున్నారు

చందుర్తి: మండలంలోని మూడపల్లి, మరిగడ్డ గ్రామాల్లోని అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను క్యాంపు కార్యలయంలో సర్పంచులు చిలుక అంజిబాబు, నేతికుంట జలపతి శుక్రవారం కలిశారు.

సిరిసిల్ల టౌన్: ధూపదీప నైవేద్య అర్చక సిరిసిల్ల మండల నూతన కార్యవర్గంను శుక్రవారం సిరిసిల్లలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కోడం వెంకటేశం, ఉపాధ్యక్షుడు పొడిచేటి వెంకటాచార్య, కార్యదర్శి సిరిపురం లక్ష్మీనారాయణ, కోశాధికారి పంతగాని రాజేశం, సభ్యులుగా కిరణ్, పొడిచేటి గోపికృష్ణఆచార్య, దిడ్డి రాజేశం, కొక్కుల సతీష్ ఎన్నికున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వెగ్గళం సంతోష్‌శాస్త్రి, జిల్లా ఇంచార్జి మరింగంటి కొండమాచార్య పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఆర్కమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెద్ద బాలశిక్ష, దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ అరవింద్ కుమారుడు గౌతమ్ పుట్టిన రోజు పురస్కరించుకుని విద్యార్థులకు దుస్తులు, పెద్ద బాలశిక్షతో పాటు పండ్లు పంపిణీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం దుబ్బాక ప్రభాకర్ తెలిపారు.

- తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ వృద్ధాశ్రమానికి నరేన్ ఫౌండేషన్‌కు చెందిన అమృత పిల్లల దవఖాన డాక్టర్ సురేంద్రబాబు వితరణగా అందించారు. నేషనల్ యూత్ డే సందర్భంగా రూ. 52 వేల విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను వితరణగా ఆందిచనట్లు డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు. అలాగే దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ గనప శివజ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణ్ బాస్కర్, కో ఆర్డీనేటర్ మమత, ఎఎన్ఎం సుమేరియా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



రుద్రంగిలోని కృష్ణవేణి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

గంభీరావుపేట, జనవరి 12: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి పండగ వేడుకల్లో బాగంగా రంగు రంగుల ముగ్గులను వేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు కిషన్, దేవరాజు, పద్మజ విద్యార్థులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శుభోదయ పాఠశాలలో ముందస్తు భోగి, సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ముగ్గులు వేయగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తుగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాద్ రాజు పాల్గొన్నారు.



గంభీరావుపేటలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఊపిరి ఉన్నంతవరకు పుట్టిన ఊరిని మర్చిపోను

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఎల్లారెడ్డిపేట, జనవరి 12: ఊపిరి ఉన్నంతవరకు పుట్టిన ఊరైన కోరుట్లపేటను మరిచిపోనని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో శుక్రవారం అయన పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి స్వగ్రామమైన కోరుట్లపేటకు మొదటిసారి రావడంతో గ్రామస్థులు, బాల్యమిత్రులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. గొల్లపల్లి నుంచి కోరుట్ల పేట వరకు బైకులు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులు, స్నేహితులు గజమాలతో సత్కరించారు. అంతకుముందు బొప్పాపూర్ సత్తెపీరీల దర్గా వద్ద కుటుంబ సభ్యులతో కలిసి అయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన అయన మొదటగా తల్లిదండ్రులు భూపాల్ లక్ష్మిలను శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచినా నేను మీ అందరి బిడ్డనేనని అన్నారు. తన స్వగ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఆదరించి, అభిమానిస్తూ స్వాగతం పలికిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి దేవానందం, మిత్రులు, బంధువులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై దుష్ప్రచారం తగదు

ముస్తాబాద్, జనవరి 12 : కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం తగదని, బీఆర్ఎస్ పాలనలో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో దొరలు మాత్రమే బాగుపడ్డారన్నారు. కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజలు తిరస్కరించిన ఇంకా అధికారంలో ఉన్నామని బీఆర్ఎస్ నాయకులు అనుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాలను కప్పి పుచ్చడానికే కాంగ్రెస్ పార్టీపై అర్థం లేని విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. అరు గ్యారెంటీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, తలారి నర్సింలు, గోవర్ధన్, బుర్ర రాములు, ఏదూనూరి భాను చందర్, వేముల సత్యనారాయణగౌడ్, తాడెపు కొమురయ్య, వంగ మోహన్‌రెడ్డి, రంజాని నరేష్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, దీకొండ దశరథం పాల్గొన్నారు.